క్లుప్తంగా

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కేశంపేట: మండల పరిధిలో 79 మందికి లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ అజాంఅలీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. షాద్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి లబ్ధిదారులు ఉదయం 9గంటల వరకు రావాలని సూచించారు.

ధ్రువపత్రాల జారీలో జాప్యం

ఇబ్బంది పడుతున్న దరఖాస్తుదారులు

షాద్‌నగర్ రూరల్: రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తులు చేసుకునేందుకు కావాల్సిన ధృవపత్రాల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కులం, ఆదాయం ధృవపత్రాల కోసం మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకుని పడిగాపులుకాస్తున్నారన్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లోనూ సర్వర్ల పని చేయకపోవడంతో సమస్య మరింత జఠిలమవుతుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సర్వర్ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

విద్యా వలంటీర్‌కు వేతనం అందజేత

కొందుర్గు: కొందుర్గు పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి గురువారం చెర్కుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యా వలంటీర్‌కు ఒక నెల వేతనం అందజేశారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని విద్యార్థుల సౌకర్యార్థం ఒక వలంటీర్‌ను నియమించాలని హెచ్‌ఎం శివారెడ్డి పీఏసీఎస్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన వెంటనే స్పందించి ఒక వలంటీర్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆమెకు నెల రోజుల వేతనం రూ.5వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శివారెడ్డి, ఉపాధ్యాయులు సుష్మ, వనిత, కాంగ్రెస్ మండలాధ్యక్షులు కృష్ణా రెడ్డి, నాయకులు నరేందర్, యాదయ్య పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్

కేశంపేట: పార్టీ కార్యకర్తలకు, వారి కుటుంబ సభ్యులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని మాజీ ఎంపీపీ ఎల్లమోని రవీందర్‌యాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని తొమ్మిదిరేకుల ఎంపీటీసీ మాజీ సభ్యుడు యాదయ్య మాతృమూర్తి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న రవీందర్‌యాదవ్ పార్టీ నాయకులతో కలిసి ఆమె మృతదేహానికి నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళి అర్పించిన వారిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, మధుసూదన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పంటరక్షణపై అవగాహన



నక్కలపల్లిలో రైతులకు పంటలపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో భాగంగా గురువారం రైతులకు పంటల రక్షణపై విద్యార్థులు అవగాహన కల్పించారు. హైదరాబాద్‌లోని ఏవీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ విద్యార్థులు గ్రామంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో సమగ్ర ఇంటి సర్వే, రైతుల గొప్పతనం, రైతులు పండిస్తున్న పంటలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి అంజయ్య, మల్లేష్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో మున్సిపల్ అధికారుల తనిఖీలు

కొత్తూరు: పట్టణంలోని పలు హోటళ్లు, బేకరీల్లో మున్సిపల్ అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. రెడ్‌బకెట్, స్టార్ బవార్చి హోటళ్ల నిర్వాహకులు సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని గుర్తించి వారికి జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ మహేష్‌గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయాల అభివృద్ధికి కృషి

శంషాబాద్: విద్యాలయాలు.. సామాజిక దేవాలయాలని ఫ్రాంక్లిన్ టెంపుల్‌టౌన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ గౌరవ్‌గార్గ్ అన్నారు. రౌండ్‌టేబుల్ స్వచ్ఛంద సంస్థ భాగస్వామ్యంతో ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ సహకారంతో తొండుపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన మూడు అదనపు తరగతి గదులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యాలయాల అభివృద్ధికి తమ సంస్థ చేసిన కృషిని వివరించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ప్రధానోపాధ్యాయుడు బాల్‌రెడ్డి సూచించారు.

లక్ష్యానికి చేరువగా..

పన్నుల వసూలు
- ఇప్పటికే 91శాతం పూర్తి
- 18 గ్రామ పంచాయతీల్లో శత శాతం
- తీవ్రంగా శ్రమిస్తున్న కార్యదర్శులు



తూర్పుగడ్డతండాలో ఐరన్ కంపెనీ వద్ద ట్యాక్స్ వసూలుకు వెళ్లిన అధికారులు

కేశంపేట: మండల పరిధిలోని 29 గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటి పన్నుల రూపంలో సుమారుగా రూ.60 లక్షలు వసూలు చేయాల్సి ఉండగా పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారుల కృషితో రూ.55లక్షల వరకు వసూలు చేశారు. మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీల్లో వంద శాతం ఇంటి పన్నులు వసూళ్లు చేశారు. మార్చి 31 వరకు గడువు ఉండటంతో అప్పటిలోగా అన్ని గ్రామాల్లో వంద శాతం ఇంటి పన్నులను వసూళ్లు చేయాలనే లక్ష్యంతో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నారు. పుట్టోనిగూడ, భైర్కాన్‌పల్లి, బోధునంపల్లి, చింతకుంటపల్లి, చౌలపల్లి, దత్తాయపల్లి, ఇప్పలపల్లి, కోనాయపల్లి, కొండారెడ్డిపల్లి, లేమామిడి, లింగంధన, మంగళిగూడ, నిర్దవెల్లి, పాటిగడ్డ, పాల్కోనిగుట్టతండా, పోమాల్‌పల్లి, సుందరపురం, తొమ్మిదిరేకుల గ్రామాల్లో వంద శాతం పూర్తయింది. ఈ గ్రామాల పరిధిలో రూ.5లక్షల వరకు వసూలు చేయాల్సి ఉంది. గడువులోగా లక్ష్యంను చేరుకోవడానికి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు కృషి చేస్తున్నారు.

11 పంచాయతీల్లో పన్నుల వసూలు వివరాలు

గ్రామం	వసూలు శాతం
పాపిరెడ్డిగూడ	94
సంతాపూర్	94
కేశంపేట	93
అల్వాల	92
దేవునిగుడితండా	90
కొత్తపేట	90
కాకునూర్	88
ఎక్లాస్‌ఖాన్‌పేట	85
సంగెం	83
వేములనర్వ	67
తూర్పుగడ్డతండా	64

వందశాతం వసూలు చేస్తాం



మండల పరిధిలోని 18 గ్రామాల్లో ఇప్పటికే వంద శాతం వసూలు సాధించాం. మిగిలిన 11 గ్రామాల్లోనూ గడువులోగా వంద శాతం ఇంటి పన్నులను వసూళ్లు చేస్తాం. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని త్వరలోనే పూర్తి చేస్తాం. ఆయా గ్రామాల్లో ప్రజలు, పంచాయతీ కార్యదర్శులకు సహకరించాలి.

– కిష్టయ్య, ఎంపీఓ, కేశంపేట

గ్రామాభివృద్ధికి సహకరించాలి



ప్రజలు ఇంటి పన్నులను చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలి. ప్రజలు చెల్లించిన ఇంటి పన్నులు గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు ఉపయోగిస్తాం. గ్రామం అభివృద్ధి చెందాలంటే ప్రజలు స్వచ్ఛందంగా ఇంటి పన్నులు చెల్లించేందుకు ముందుకు రావాలి.

– శ్వేత, పంచాయతీ కార్యదర్శి, తూర్పుగడ్డతండా

వడ్డీ రాయితీని వినియోగించుకోవాలి

చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్



రైతులకు రుణాలను అందిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ అశోక్

నందిగామ: రైతులు తమ రుణాలను సకాలంలో చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని చేగూరు పీఏసీఎస్ చైర్మన్ గొర్లపల్లి అశోక్ సూచించారు. మండల పరిధిలోని చేగూరులోని పీఏసీఎస్‌లో గురువారం మహా జనసభ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ అశోక్ మాట్లాడుతూ.. రైతులకు కావాల్సిన రుణాలను అందిస్తామని, గతంలో తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించాలని సూచించారు. వచ్చే సీజన్‌లో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచుతామన్నారు. మొండి బకాయిల వసూలు, సభ్యత్వ నమోదును ప్రక్రియ విషయాలను సంఘం సభ్యులతో చర్చించారు. సంఘం ఆర్థిక లావాదేవీల టర్నోవర్ సుమారు రూ.10 కోట్లు ఉందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మున్నూరు పద్మారావు, సీఈఓ వెంకటయ్య, డైరెక్టర్లు బండి మల్లేష్, మల్రెడ్డి, పాండు, నర్సింలు, చంద్రశేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



అజీజ్‌నగర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి దేవేందర్

మొయినాబాద్/మొయినాబాద్ రూరల్: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, ఇతర నాయకుల అరెస్టులను నిరసిస్తూ సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. గురువారం మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల రామోజీ ఫిలింసిటీ యాజమాన్యం కబ్జా చేశారని.. వాటికోసం బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చేపట్టిన పోరాటంలో సీపీఎం నాయకులను పోలీసులు అక్రమ అరెస్టులు సరికాదన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనకారులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ప్రవీణ్‌కుమార్, మహేందర్, రాజేందర్, సాయి, వెంకటేష్, కృష్ణ, శ్రీను, యాదగిరి, ఇస్మాయిల్, బాలు, డాన్ తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లిస్తేనే మున్సిపల్ అభివృద్ధి

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి



పన్ను చెల్లిస్తున్న జైపాల్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతీ ఒక్కరు పన్నులు చెల్లించాలని ఇది మన అందరి బాధ్యత అని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొత్త జైపాల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో ఆస్తిపన్నులు విధిగా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, రెవెన్యూ అధికారి జమీల్ అహ్మద్, బిల్ కలెక్టర్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వం పాలన నుంచి వైదొలగాలి'

కొందుర్గు: పాలన చేతగాని ప్రభుత్వం వెంటనే పాలన నుంచి వైదొలగాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర నాయకుడు భూపాలాచారి అన్నారు. గురువారం ఆయన్ను చౌదరిగూడ పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా భూపాలాచారి మాట్లాడుతూ.. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయి 15 నెలలు గడిచినా తాము చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ప్రజాస్వామ్య యుతంగా ఉద్యమానికి పిలుపునిస్తే గృహనిర్బంధం చేయడం సరికాదన్నారు.

నాయకుల ముందస్తు అరెస్టు

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులను విడుదల చేయకపోవడంతో మాజీ ప్రజాప్రతినిధులు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈమేరకు ఆయా గ్రామాల్లో మాజీ సర్పంచ్‌లను ముందస్తు అరెస్ట్ చేశారు. గురువారం నక్కలపల్లి మాజీ సర్పంచ్ స్వప్న భర్త అంజయ్యగౌడ్‌ను గృహనిర్బంధం చేశారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

నిట్ వరంగల్ ప్రొఫెసర్ వేణుగోపాల్



కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ వేణుగోపాల్

మొయినాబాద్: సాంకేతిక రంగ విద్యార్థులు విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలని వరంగల్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) ప్రొఫెసర్ వేణుగోపాల్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు ఇన్విక్టా–2025 పేరుతో సాంస్కృతిక, క్రీడా ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో వివిధ ప్రాంతాల నుంచి 48 కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లో పాల్గొనడంతో మేధాశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రోహిత్ కందకట్ల, ప్రిన్సిపల్ సాయి సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో విద్యుత్ మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కొత్తూరు: మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డులో ఒకే స్తంభానికి రెండు భాగాలుగా ఏర్పాటు చేసిన విద్యుత్ తీగల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు కౌన్సిలర్ హేమాదేవేందర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన ఆమె గురువారం ట్రాన్స్‌కో, మున్సిపల్ సిబ్బందితో కలిసి సొంత ఖర్చుతో ప్రమాదాలు జరగకుండా మరమ్మతులు చేయించారు. గతంలో గాలులు, వర్షాల కారణంగా టీవీలు, రిఫ్రిజిరేటర్లు, ఇతర గృహోపకరణాలు కాలిపోయినట్లు వివరించారు. తమ సమస్యను చెప్పగానే స్పందించి పరిష్కరించిన కౌన్సిలర్‌ను వార్డు వాసులు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌ముదిరాజ్, ట్రాన్స్‌కో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పండుగలు ఐక్యతకు ప్రతీక

మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్



రంజాన్ తోఫాతో ముస్లింలు

షాద్‌నగర్: రంజాన్ మతసామరస్యానికి ప్రతీక అని మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. రంజాన్ సందర్భంగా గురువారం మున్సిపల్ పరిధిలోని బీఆర్‌ఎస్ 10వ వార్డు అధ్యక్షుడు చెర్కు శివ ఆధ్వర్యంలో ఈద్గా వద్ద ముస్లింలకు రంజాన్ తోఫా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రవీందర్ యాదవ్ హాజరై మాట్లాడుతూ.. పండుగలు ఐక్యతకు ప్రతీకలు అన్నారు. యువత సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎంఎస్ నటరాజ్, నాయకులు యుగేందర్, శేఖర్, శంకర్, రవి, అద్దు, చిన్న, యాదగిరి, సాధిక్, బిలాల్, అశ్రఫ్, అజహర్, నిజాం, మహమూద్, భిక్షపతి, సందీప్, రాఘవేందర్, పవన్‌సింగ్, నవీన్, వినోద్, సాయి యాదవ్, శ్రీశైలం, మల్లేష్, మధు, రాజశేఖర్, పాండు, మూర్తి, రఘు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య

షాద్‌నగర్: చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రంగంపల్లి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు పిట్టల సురేష్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ... వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షనీయమని అన్నారు. పార్టీ నాయకులు సేవా భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. సంపాదించిన దానిలో కొంత సమాజాభివృద్ధికి, పేదల కోసం ఖర్చు చేయాలన్నారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు పార్టీ నాయకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేష్‌గుప్తా, అశోక్, వంశీకృష్ణ, వెంకటేష్, ప్రశాంత్, శ్రీనివాస్‌చారి, ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, గణేష్, సుధాకర్, రాజు నాయక్, పాపయ్య, లక్ష్మయ్య, అంజయ్యగౌడ్, శ్రీకాంత్, రవీందర్‌గౌడ్, శివకుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎ–బ్లాక్ ఉపాధ్యక్షురాలిగా అశ్విని



అశ్వినికి నియామకపత్రం అందజేస్తున్న మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి

షాబాద్: కాంగ్రెస్ నియోజకవర్గ ఎ–బ్లాక్ ఉపాధ్యక్షురాలిగా పల్లాటి అశ్విని నియమించినట్లు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పామెన జ్యోతి భీంభరత్ వెల్లడించారు. గురువారం మండల పరిధిలోని సర్దార్‌నగర్‌లో మహిళా నేతలతో సమావేశమైన జ్యోతి గ్రామానికి చెందిన పల్లాటి అశ్వినికి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా సాధికారత కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. హామీల అమలుకు పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. పార్టీ కార్యకర్తలంతా ఐక్యంగా ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యకర్తల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి వారికి సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పారు. ఈ కారక్రమంలో మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు స్వరూప, సర్దార్‌నగర్ గ్రామ అధ్యక్షురాలు అరుణ, పార్టీ గ్రామ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, ఉమేష్, జాదవ్, తదితరులున్నారు.

తొమ్మిదేళ్లుగా ప్రతీ కార్యక్రమం విజయవంతం



బొక్క నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న చేవెళ్ల బీజేపీ నాయకులు

బీజేపీ మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి

చేవెళ్ల: తొమ్మిదేళ్లుగా పార్టీ పిలుపునిచ్చిన ప్రతీ కార్యక్రమాన్ని పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి విజయవంతం చేశారని పార్టీ చేవెళ్ల నాయకులు అన్నారు. గురువారం బీజేపీ చేవెళ్ల మండల నాయకులు నర్సింహారెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, నాయకులు ఆంజనేయులుగౌడ్, డాక్టర్ మాల్గారి వైభవ్‌రెడ్డి, దేవుని శర్వలింగం, ఇంద్రాసేనారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అభిలాష్, వెంకటేశ్, ప్రవీణ్, బాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఎంజీఐటీలో ముగిసిన హ్యాకథాన్

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాల వార్షికోత్సవ సంబరం నిర్వాణ–2025లో భాగంగా బుధవారం ప్రారంభమైన 24 గంటల సాంకేతిక హ్యాకథాన్ గురువారం ముగిసింది. జాతీయ స్థాయిలో జరిగిన కార్యక్రమంలో పలు కళాశాలలకు చెందిన 1100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సైబర్ సెక్యూరిటీ, డ్రోన్ టెక్నాలజీ, రోబొటిక్స్, సస్టైనబుల్ ఇన్నొ, ఓపెన్ ఇన్నొవేషన్ లాంటి పోటీలలో పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ చూపిన 12 మంది విద్యార్థులకు నగదు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం క్రీడా దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథి జేఎన్‌టీయూ ఆర్డీ డైరెక్టర్ వి.కామాక్షిప్రసాద్, గౌరవ అతిథి, జాతీయ వాలీబాల్ క్రీడాకారిణి, యోగా గురువు కె.అరుణాదేవి మాట్లాడుతూ... భారత్‌ను పూర్వంలా విశ్వగురువుగా నిలిపేందుకు యువత కృషి చేయాలన్నారు. క్రీడలు, టెక్నో ఫెస్ట్‌లలో రాణించిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కె.సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మినరల్' ముసుగు..!



అమ్మకానికి సిద్ధంగా ఉన్న నాణ్యతలేని మినరల్ వాటర్ బబూల్స్

శాస్త్రిపురం: రాజేంద్రనగర్ సర్కిల్‌లో మినరల్ వాటర్ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా.. కనీస నాణ్యత ప్రమాణాలను పాటించకుండా వ్యాపారులు నీటిని అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

- రాజేంద్రనగర్ సర్కిల్‌లో దాదాపు చిన్నచితకా 30కిపైగా మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఉన్నాయి. ఇందులో పది ప్లాంట్లకు కూడా అనుమతి లేదు. అధికారులు వీటిపై నిఘా పెట్టక పోవడంతో పూటకో వాటర్ ప్లాంట్ పుట్టుకొస్తోంది.
- ఐఎస్ఐ మార్కు లేకుండా నీటిని విక్రయిస్తున్నారు. కిరాణా.. జనరల్ స్టోర్స్, మెడికల్ షాపులు, హోటళ్ల వద్ద మినరల్ వాటర్ బబూల్స్‌ను విక్రయిస్తున్నారు. నిర్దిష్ట ధర అనేది లేకుండా రూ. 15 మొదలు కొని రూ. 35 వరకు బబూల్స్‌ను విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు.
- రాజేంద్రనగర్‌లో దాదాపు 40కిపైగా వివిధ వాటర్ సప్లయ్ కంపెనీలు నీటిని ఇంటింటికీ తిరిగి అందజేస్తున్నాయి. ఒకే ప్లాంట్ నుంచి నీటిని తీసుకొని వేర్వేరు కంపెనీల పేరుతో సరఫరా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
- కనీస నాణ్యత, పరిశుభ్రతలపై తనిఖీలు చేసిన పాపాన పోకపోవడంతో వ్యాపారులు యథేచ్ఛగా మోసాలకు పాల్పడుతున్నారు. నీటి వ్యాపారులు అందరు కలిసి ప్రతి నెల అధికారులకు పెద్ద మొత్తంలో ముడుపులు అందజేస్తున్నందునే వారు ఈ తరహా నీటి వ్యాపారం వైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలున్నాయి.
- వేసవిలో వ్యాపారులకు నీటి వ్యాపారం మరింత లాభాలను చేకూర్చుతుండటంతో వారి ఆగడాలకు అడ్డుఅదుపు లేకుండా పోతోంది.
- అపార్టుమెంట్లు, కాలనీలవాసులు నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో మినరల్ వాటర్ కంపెనీలను ఆశ్రయిస్తున్నారు. దీంతో వ్యాపారులు ఇదే అవకాశంగా అపరిశుభ్రమైన బాటిళ్లలో నీటిని అందిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. వ్యాపారులను ఏమీ అనలేక నీటి కొరతతో నకిలీ మినరల్ వాటర్ తాగుతూ అనారోగ్యాలను కొని తెచ్చుకుంటున్నారు.

బోర్ నీటినే...

సర్కిల్ పరిధిలోని పలు మినరల్ వాటర్ ప్లాంట్‌ల నిర్వాహకులు బోర్ నీటినే బబూల్స్‌లో నింపి విక్రయిస్తున్నారు. ఫిల్టర్ చేసే సమయంలోనే నీటి ట్యాంకుల్లో సగం బోర్ నీటిని నింపి అందులో సగం మినరల్ నీటిని కలుపుతున్నారు.

- రుచి కోసం పౌడర్, లిక్విడ్‌లను కలుపుతున్నట్లు సమాచారం. ప్లాంట్‌లో పెద్దమొత్తంలో బబూల్స్‌ను కొనుగోలు చేసే వారికి సగం మినరల్ వాటర్, సగం బోర్‌నీటినే అందజేస్తున్నారు. దీంతో నీటిని తాగిన ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఏళ్ల తరబడి ఉపయోగించే నీటి బాటిళ్లను వాడుతున్నారనే విమర్శలు ఉన్నాయి.
- వ్యాపారులు ఏనాడూ నీటి బాటిళ్లను శుభ్రం చేసినా దాఖలాలు ఉండవనే ఆరోపణలున్నాయి. బాటిళ్లో దుర్వాసన వస్తుడటంతో ప్రశ్నిస్తే మినరల్ వాటర్ బాటిళ్ల అలాగే ఉంటాయని ఇష్టం అయితే తీసుకోండి.. అంటూ దబాయిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు..

అధికారులూ దృష్టి సారించండి...

సర్కిల్‌లో జరుగుతున్న మినరల్ వ్యాపారంపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. బోర్ నీటినే మినరల్ వాటర్ పేరుతో అమ్ముతూ ప్రజలను మోసం చేస్తున్న ప్లాంట్‌ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా అనుమతులు లేని ప్లాంట్‌లను మూసి వేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.